## కాంగ్రెస్ హామీలు అమలు చేయాలి

కలెక్టరేట్, జూన్ 10 : శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకిచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, తెలంగాణ ఉద్యమకారుల వేదిక జిల్లా శాఖ కన్వీనర్ ఎండి.రాజ్‌మహ్మద్ డిమాండ్ చేశారు. నగరంలోని లక్ష్మీనగర్‌లో గల ఆసంఘం జిల్లాశాఖ కార్యాలయంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. ఉద్యమకారులను గుర్తించి, వారికి సముచిత ప్రాధాన్యత కల్పిస్తామని చేసిన వాగ్దానంతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు అనంతరం హామీలు మరిచిందని విమర్శించారు. పాలనాపగ్గాలు చేపట్టి ఏడాదిన్నర గడిచినా ఉద్యమకారుల శ్రేయస్సును మరవడం శోచనీయమన్నారు. ముందుగా ఉద్యమకారులను గుర్తించాలని, ఇందుకోసం ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు. ప్రత్యేక పోరులో తమవంతు పాత్ర పోషించిన వారికి మాత్రమే కమిటీల్లో స్థానం కల్పించాలని కోరారు. ప్రభుత్వం గుర్తించిన ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలంతో పాటు పెన్షన్ సౌకర్యం కూడా కల్పిస్తూ, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం కాలయాపన చేస్తే మరో ఉద్యమానికి నాంది పలికినట్లవుతుందన్నారు. సమావేశంలో టీయూవీ నాయకులు వెంకటేశ్వర్, మహేందర్‌కుమార్, శ్రీనివాస్‌యాదవ్, రాజ్‌కుమార్, లక్ష్మీనారాయణ, చందా వీరేశం, సత్యనారాయణరావు, అల్లాడి రాజ్‌కుమార్, కరీం, రిజ్వానా, పుష్పలత, శ్రీవాణితో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఇసుక క్వారీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



కోర్కళ్ వద్ద రోడ్డుపై ధర్నా చేస్తున్న ఇసుక లారీల డ్రైవర్లు

వీణవంక, జూన్ 10: ఇసుక కోసం ఆన్‌లైన్‌లో డీడీలు కట్టి రోజుల తరబడి ఎదురు చూసినా కోర్కళ్ ఇసుక క్వారీ యాజమాన్యం ఇసుక లోడ్ చేయడం లేదని లారీ డ్రైవర్లు కరీంనగర్– జమ్మికుంట ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో చేశారు. ఇసుక క్వారీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సుమారు గంట పాటు రోడ్డుపై బైఠాయించడంతో కిలోమీటరు పొడవునా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా లారీ డ్రైవర్లు మాట్లాడుతూ, ఇసుక లోడ్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్న కోర్కళ్ క్వారీ యాజమాన్యంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం స్థానిక పోలీసులు వచ్చి, ఇసుక లోడ్‌లు అయ్యేలా చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పడంతో లారీ డ్రైవర్లు ధర్నా విరమించారు.

### ట్రాఫిక్‌లో ఇరుకున్న అంబులెన్స్

కోర్కళ్ గ్రామం వద్ద ఇసుక లారీ డ్రైవర్ల ఆందోళనతో ట్రాఫిక్ జామ్ కాగా, కిష్టంపేట నుంచి జమ్మికుంటకు వెళ్తున్న అంబులెన్స్ వాహనాల మధ్య ఇరుక్కుపోయింది. పేషెంట్ సుమారు 15 నిమిషాల పాటు నరకయాతన అనుభవించాడు. అక్కడే ఉన్న కొందరు చొరవ తీసుకొని అంబులెన్స్ వెళ్లేంత ట్రాఫిక్ క్లియర్ చేయడంతో సమస్య తీరింది.

## ఆర్మీ జవాన్‌కు వాకర్స్ సత్కారం



ఆర్మీ జవాన్ తిరుపతిని సత్కరించిన వాకర్స్

హుజూరాబాద్ రూరల్, జూన్ 10: మండలంలోని కనుకులగిద్ద గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ రామారపు తిరుపతి ఇటీవల ఆపరేషన్ సిందూర్‌లో పాలుపంచుకుని ఇటీవల క్షేమంగా గ్రామానికి చేరుకోగా, మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని బాలుర క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు హరిప్రసాద్, మాజీ అధ్యక్షుడు గోవర్ధన్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు బండ శ్రీనివాస్, సామాజిక కార్యకర్త రవీందర్‌రావు, ప్రధాన కార్యదర్శి మథిన్, కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు సంపత్, రాజు, కొండల్‌రెడ్డి, రత్నం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఏం సాధించారని సంబురాలు?



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

- ఎంపీగా 'బండి' పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి చిల్లి గవ్వ తీసుకురాలేదు
- బీజేపీ అబద్ధపు ప్రచారాన్ని ప్రజలు నమ్మరు
- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కార్పొరేషన్, జూన్ 10: కరీంనగర్ నుంచి రెండోసారి ఎంపీగా గెలిచి కేంద్ర సహాయ మంత్రిగా సంవత్సరం పూర్తి చేసుకున్న బండి సంజయ్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కేంద్రం నుంచి చిల్లి గవ్వ కూడా తేలేదని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ విమర్శించారు. ఏడాది కాలంలో ఎంపీగా ఏం సాధించాడని బీజేపీ నాయకులు సంబురాలు చేసుకున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. మంగళవారం నగర బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రం నుంచి వచ్చే ఆన్‌గోయింగ్ పథకాలు తప్ప ఎంపీగా ప్రత్యేకంగా తీసుకువచ్చిన నిధులు ఏమున్నాయో చెప్పాలని సవాల్ చేశారు. ఈజీఎస్, అమృత్ లాంటి ఆన్ గోయింగ్ పథకాల పనులను చూపెట్టి సంబురాలు చేసుకోవడం బీజేపీ నేతల అబద్ధపు ప్రచారాలకు నిదర్శనమన్నారు. పార్లమెంట్ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయకుండానే బీజేపీ నేతలు సంబురాలు జరుపుకోవడంపై ప్రజలు ఆశ్చర్యపోతున్నారని విమర్శించారు. బండి సంజయ్‌కి చిత్తశుద్ధి ఉంటే కేంద్రం నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు నవోదయ పాఠశాలలు, సైనిక్ స్కూల్స్ మంజూరు చేయించాలన్నారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాలను ప్రసాద్ స్కీంలో చేర్చి అభివృద్ధి నిధులు ఇప్పించాలన్నారు. కరీంనగర్ నుంచి తిరుపతికి ప్రతిరోజూ రైలు నడిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిరుద్యోగ యువత ఉపాధి కల్పించే విధంగా కేంద్రం నుంచి కొత్త పరిశ్రమ ఏర్పాటు చేయించాలన్నారు. నగర పర్యటనకు వచ్చిన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్ స్థానిక డంప్ యార్డు తొలగింపునకు నిధులు ఇస్తామని చెప్పినా, ఇప్పటికీ రూపాయి కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని బీజేపీ తన ఖాతాలో వేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మోసం చేసి రెండు సార్లు గెలిచి నయాపైసా అభివృద్ధి చేయని బండి సంజయ్ ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు. కేసీఆర్, కేటీఆర్‌ను తిట్టి నువ్వు నాయకుడివి అయ్యావని విమర్శించారు. అవినీతి అనకొండలను పక్కన పెట్టుకొని బండి సంజయ్ అవినీతి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. అనుక్షణం రాష్ట్ర అభివృద్ధికి పాటుపడిన బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్, కేటీఆర్‌పై విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. సమావేశంలో కొత్తపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ రుద్రరాజు, మాజీ వైస్ ఎంపీపీ భూక్యా తిరుపతి నాయక్, బీఆర్ఎస్ నాయకులు గడ్డం ప్రశాంత్‌రెడ్డి, చందు, చేతి చంద్రశేఖర్, ఆరె రవి గౌడ్, ఎడబోయిన శ్రీనివాసరెడ్డి, నారదాసు వసంతరావు, సత్తినేని శ్రీనివాస్, నాగుల కిరణ్ కుమార్ గౌడ్, మేచినేని పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో అమ్మకాలు ప్రారంభించాలి



ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో పనులను పరిశీలిస్తున్న కమిషనర్

కార్పొరేషన్, జూన్ 10: నగరంలోని పద్మనగర్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో అన్ని సౌకర్యాలు కల్పించామని, వ్యాపారులు తమ అమ్మకాలను మొదలు పెట్టాలని నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. నగరంలోని పద్మనగర్‌లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను మంగళవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, మార్కెట్‌లో స్టాల్స్, షెట్టర్లు పొందిన వారు, నగరపాలక సంస్థలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు తమ వ్యాపారాలను ప్రారంభించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## 3వ డివిజన్ విభజనపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కరీంనగర్ రూరల్, జూన్ 10: వార్డు డీలిమిటేషన్ నోటిఫికేషన్‌లో కార్పొరేషన్ 3వ డివిజన్ దుర్శేడ్ పరిధిలోని గోపాల్‌పూర్ గ్రామానికి సంబంధించిన పరిపాలన విభజనపై స్పష్టత లేదని గ్రామ నాయకుడు ఊరడి మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ ఆరె శ్రీకాంత్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గోపాల్‌పూర్, దుర్శేడ్ గ్రామాలను కలిపి డివిజన్ ఏర్పాటు చేస్తే మౌలిక సదుపాయాలు, నిర్వహణ, పారిశుధ్య పనులు, తదితర సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు.

## ముగిసిన టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ కోర్సు



విద్యార్థులు వేసిన పెయింటింగ్స్ పరిశీలిస్తున్న కలెక్టర్

కమాన్‌చౌరస్తా, జూన్ 10 : జిల్లా కేంద్రంలోని ధన్గర్‌వాడీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ కోర్సు– 2025 ముగింపు కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. విద్యార్థులు తయారుచేసిన వివిధ వస్తువులు, డ్రెస్ మోడల్స్, ఎంబ్రాయిడరీ వస్తు ప్రదర్శనను తిలకించి అభినందించారు. తర్వాత కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాధారణ విద్యతోపాటు ఏదైనా కళలో అందరూ రాణించాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి ఆంజనేయులు మాట్లాడుతూ, 42 రోజుల శిక్షణను విద్యార్థులు మున్ముందు తమ జీవితాల్లో వినియోగించుకోవాలన్నారు. బొట్ల రామస్వామి నివేదికను సమర్పించగా, సూపరింటెండెంట్ నరసింహస్వామి, ఏసీజీ సంధ్యారాణి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ప్రమోద, ప్రమీల, విద్యాశాఖ కోఆర్డినేటర్స్ మిల్కూరి శ్రీనివాస్, కృపారాణి, డీఎస్‌వో జైపాల్ రెడ్డి, ఓపెన్ పాఠశాల కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, కేఎస్ అనంతాచార్య, గాజుల రవీందర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PASSPORT LOST

★ Bhukya Ganesh S/o.Lingam H.No. 2-26, R/o. Vanpalle, Vernapally Mandal Rajanna Sircilla Dist. My Passport No.H8339529 Lost By travelling from Vanpalle to Sircilla. If any one Find Please Call me : 9494993998

NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవాలసిందిగా పాఠకులకు సూచిస్తున్నాము. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్స్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571

9182 777 189

## అంగన్‌వాడీ బాట విజయవంతం చేయాలి

కలెక్టరేట్, జూన్ 10 : ఈనెల 17 వరకు జిల్లాలో నిర్వహించనున్న అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, జిల్లా సంక్షేమాధికారి ఎం.సరస్వతి కోరారు. అంగన్‌వాడీ టీచర్లు తమ తమ కేంద్రాల పరిధిలో గల చిన్నారుల తల్లిదండ్రుల వద్దకెళ్లి అవగాహన కల్పించాలని, మూడేళ్లలోపు గల పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్చేలా ప్రోత్సహించాలన్నారు. అంగన్‌వాడీల్లో అందుతున్న సేవలతో కలిగే ప్రయోజనాలపై వివరించాలన్నారు. గ్రామస్థాయిలో తల్లిదండ్రులు, స్వయంసహాయక సంఘాల సభ్యులతో కలిసి ర్యాలీలు నిర్వహిస్తూ, అంగన్‌వాడీ కేంద్రాల ఆవశ్యకతను చాటిచెప్పాలన్నారు. సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం పండుగ వాతావరణంలో నిర్వహించాలని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను ఆదేశించారు.

## రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తుల వెల్లువ



ఇరుకుల్ల రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు స్వీకరిస్తున్న కరీంనగర్ ఆర్డీవో, తహసీల్దార్

శంకరపట్నం/ మానకొండూర్ రూరల్/ కరీంనగర్ రూరల్, జూన్ 10: భూ సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో రెవెన్యూ శాఖ అధికారులు సదస్సులు నిర్వహిస్తున్నారు. శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సులో 123, మానకొండూర్ మండలం కొండపల్కల గ్రామంలో 278 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్లు సురేఖ, విజయ్ కుమార్ తెలిపారు. కరీంనగర్ మండలం ఇరుకుల్ల గ్రామంలో రెవెన్యూ సదస్సుకు కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ హాజరుకాగా, ఈ సందర్భంగా 136 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ రాజేశ్ తెలిపారు. కాగా, ఇరుకుల్ల గ్రామంలోని సర్వేనంబర్ 314/బిలో నరసింహస్వామి దేవాలయానికి దారి ఉండగా, అది ఆక్రమణకు గురైందని ఆర్డీవోకు జువ్వాడి అశోక్‌రావు, తదితరులు ఫిర్యాదు చేశారు.

## కనీస వేతనం పెంచాలి

తెలంగాణచౌక్, జూన్10: కార్మికుల కనీస వేతనం రూ.25 వేలకు పెంచాలని భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతన చట్టాన్ని సవరించాల్సి ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీడి కార్మిక్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

## నేడు 'బడిబాట'

కరీంనగర్ రూరల్, జూన్ 10: మండలంలోని నగునూర్, దుర్శేడ్ గ్రామాల్లో విద్యావాహిని ప్రచార రథం ద్వారా బుధవారం ఉదయం 7 గంటలకు బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ఆయా గ్రామాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు, పాల్గొన్ని బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృతి

శంకరపట్నం, జూన్ 10: మండలంలోని కేశవపట్నం గ్రామంలో ఓ రైతు పాడి ఆవు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. పాడి ఆవు యజమాని ఆరెపల్లి తిరుపతి కథనం ప్రకారం.. మంగళవారం ఉదయం తమ పాడి ఆవును మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు వెనుక వైపు మేతకు తీసుకువెళ్లాడు. ఈ క్రమంలో పాడి ఆవు పక్కనే ఉన్న వాగులో నీటిని తాగుతుండగా వాగుకు అమర్చిన కరెంట్ మోటార్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. పశు వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్ పంచనామా నిర్వహించారు. పాడి ఆవు విలువ దాదాపు రూ.40 వేలు ఉంటుందని తెలిపారు. ఎన్‌పీడీసీఎల్ సిబ్బంది ప్రమాద తీరును పరిశీలించారు.

## నూతన ఎన్నిక

కరీనగర్ రూరల్, జూన్ 10: నగునూర్ పెరిక(పురగిరి క్షత్రియ) కుల సంఘం అధ్యక్షుడిగా ఇట్టినేని రమేశ్ ఎన్నికయ్యారు. మంగళవారం నగునూర్ పెరిక సంఘ భవనంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఇట్టినేని రమేశ్, గౌరవాధ్యక్షుడిగా కందుల నరేందర్, ఉపాధ్యక్షుడిగా కోట మునిరాజ్, ప్రధాన కార్యదర్శిగా కోట మల్లయ్య, కార్యదర్శిగా కోట కనకయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెరిక కుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు ఆర్థిక సాయం పెంచాలి

తెలంగాణచౌక్, జూన్ 10: కార్మికులకు వివిధ పథకాల ద్వారా అందిస్తున్న ఆర్థిక సాయం పెంచాలని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల మల్లేశం, ప్రధాన కార్యదర్శి రమేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం కార్మిక శాఖ కార్యాలయంలో ఉప కమిషనర్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్మిక శాఖ వివిధ సంక్షేమ పథకాలతో అందిస్తున్న ఆర్థిక సాయం పది సంవత్సరాల క్రితం నిర్ణయించారని, ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా ఆ మొత్తాన్ని పెంచాలని కోరారు. పెళ్లి కానుక రూ.30వేల నుంచి 90వేలకు, ప్రసూతి సహాయం 30 వేల నుంచి 90వేలకు, సహజ మరణానికి అందించే రూ.లక్షను రెండు లక్షలకు, దహన సంస్కారాల కోసం ఇచ్చే 30వేలను 90వేలకు, ప్రమాదశాత్తు మరణిస్తే అందిస్తున్న 6లక్షలను 9లక్షలకు పెంచాలని కోరారు. కార్మికుల పిల్లలకు విద్యావసరాల కోసం అందిస్తున్న స్కాలర్ షిప్‌లను రెట్టింపు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు సత్యం, లక్ష్మణ్, మల్లేశం పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జూన్ 10: మిడిల్ పోల్స్, విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున బుధవారం పలు ప్రాంతాలకు సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2, కరీంనగర్ రూరల్ ఏడీఈలు లావణ్య, రఘు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొత్తపల్లి(హెచ్), రాణీపూర్, ఉదయం 9నుంచి 10.30గంటల వరకు బైపాస్ ఏరియా, ఎన్టీఆర్ విగ్రహం నుంచి సబ్ స్టేషన్ వరకు, ఉజ్వల పార్కు, పాలిటెక్నిక్ కాలేజీ, ఐటీఐ కాలేజీ, హోటల్ శ్రద్ధ ఇన్, మాతృభూమి అపార్ట్ మెంట్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

## ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు వేయాలి

తెలంగాణచౌక్, జూన్ 10: నగరంలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు ఏర్పాటు చేయక లబ్ధిదారుల ఎంపికలో ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి ఆరోపించారు. నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ అలసత్వం వల్ల పేదలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారంలోగా కమిటీలను నియమించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు, నాయకులు పాల్గొన్నారు.



మల్లారెడ్డిపల్లిలో వాలీబాల్ సమ్మర్ శిక్షణ ముగింపు సమావేశంలో క్రీడాకారులతో కోచ్ కర్రె నాని

## ముగిసిన వాలీబాల్ శిక్షణ శిబిరం

వీణవంక, జూన్ 10: మల్లారెడ్డిపల్లి గ్రామంలో నెల రోజులుగా కొనసాగుతున్న వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసినట్లు కోచ్ కర్రె నాని తెలిపారు. మల్లారెడ్డిపల్లిలో 45 మంది వాలీబాల్ క్రీడాకారులకు క్రీడలో మెళకువలు నేర్పించామని చెప్పారు. క్రీడాకారులు గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎదగాలని కోచ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు గోనెల పెద్దులు, గంధం రాజు, తదితరులున్నారు.

## ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి



ఏఐఎస్ఎఫ్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

కమాన్‌చౌరస్తా, జూన్ 10 : నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, బీసీ విద్యార్థి సంఘం, ఎంఎస్ఎఫ్, టీఆర్ఎస్వీ సంఘాల బాధ్యులు మచ్చ రమేశ్, రత్నం రమేశ్, సందేశ్, పెంట అజయ్ పటేల్, చెంచెలా నవీన్, బద్దం ప్రవీణ్ రెడ్డి తదితరులు హాజరై మాట్లాడారు. జిల్లాలో ఉన్న ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు ప్రతి విద్యా సంవత్సరం ఇష్టానుసారంగా ఫీజులను పెంచడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నా విద్యా వ్యవస్థలోని సమస్యలను పట్టించుకోకపోవడం ఏమిటని మండిపడ్డారు. ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయడం వల్ల బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. విద్యా హక్కు చట్టం 2009 నిబంధనల ప్రకారం ప్రైవేట్ విద్యా సంస్థల్లో 25 శాతం పేద విద్యార్థులకు విద్యనందించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఇక్కడ కేశబోయిన రాము, మచ్చ పవన్, కళ్యాణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## 'ఆరోగ్య మహిళ'ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ

జమ్మికుంట, జూన్10: ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ పిలుపునిచ్చారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం పీవోఎంసీహెచ్ డాక్టర్ సనజవేరియా, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర చందుతో కలిసి డీఎంహెచ్‌వో సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య మహిళ శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం మహిళనుద్దేశించి మాట్లాడుతూ.. ప్రతి మంగళ, శుక్రవారం ఆరోగ్య మహిళా శిబిరంలో వైద్యుల సూచనల మేరకు పరీక్షలు చేయించుకోవాలన్నారు. శిబిరంలో 56రకాల వైద్య పరీక్షలు చేస్తారని, ప్రతి మహిళా మూడు నెలలకోసారి పరీక్షలు చేసుకోవాలని చెప్పారు. అనారోగ్యానికి గురైతే ప్రైవేటు హాస్పిటళ్లలో కాకుండా ప్రభుత్వ దవాఖానల్లోనే చికిత్స తీసుకోవాలని, మెరుగైన వసతులు ఉన్నాయని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, డ్రైడే, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. తర్వాత జమ్మికుంట ఆరోగ్య ఉప కేంద్రం–1ను తనిఖీ చేశారు. హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న మందులపై ఆరా తీశారు. ఆయన వెంట దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్, వైద్యులు, సిబ్బంది, తదితరులున్నారు.

## ఎస్‌యూ ఆర్ట్స్ కళాశాలలో డిజిటల్ క్లాస్ ప్రారంభం

కమాన్‌చౌరస్తా, జూన్ 10 : శాతవాహన విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాలలో ఆంగ్ల విభాగంలో డిజిటల్ క్లాసు రూమ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సూరేపల్లి సుజాత ప్రారంభించారు. 'డిజిటల్ క్లాస్ రూమ్' ప్రాముఖ్యతను వివరించారు. ఆంగ్ల విభాగాధిపతి విజయ ప్రకాశ్ డిజిటల్ క్లాస్ రూమ్‌ని సమకూర్చిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేశ్ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ఆధునిక సదుపాయాలతో ఆంగ్ల భాషను నేర్చుకొని, స్మార్ట్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలన్నారు. ఇక్కడ అధ్యాపకులు డాక్టర్ ప్రదీప్ రాజ్, హరికృష్ణ బోధనేతర సిబ్బంది శేఖర్, నాగతేజ, ఆంగ్ల విభాగం మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మహోన్నత వ్యక్తి ఛత్రపతి శివాజీ



మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత గ్రామ వికాస ప్రముఖ్ జిన్నా సత్యనారాయణ రెడ్డి

విద్యానగర్, జూన్ 10: తన దైన శైలిలో హిందూ ధర్మానికి కొత్త జీవాన్ని ఇచ్చిన మహోన్నత వ్యక్తి ఛత్రపతి శివాజీ మహారాజ్ అని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ తెలంగాణ ప్రాంత గ్రామ వికాస ప్రముఖ్ జిన్నా సత్యనారాయణ రెడ్డి కొనియాడారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కరీంనగర్ నగర శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ వైశ్య భవన్‌లో శివాజీ మహారాజ్ పట్టాభిశక్తుడైన రోజును పురస్కరించుకొని హిందూ సామ్రాజ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ముఖ్య వక్త హాజరైన జిన్నా సత్యనారాయణ రెడ్డి, హిందూ సామ్రాజ్య దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పారా ఒలింపిక్ పతక విజేత జాతీయ అవార్డు గ్రహీత వన్నెల అంజనా రెడ్డి మాట్లాడుతూ, నేటి దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తున్న అనేకమంది నాయకులకు శివాజీయే ఆదర్శమని, మొన్న జరిగిన ఆపరేషన్ సింధూర్ వెనుక శివాజీ యుద్ధ రణ తంత్రమే దాగి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కరినగర్ విభాగ్ సహ సంఘచాలకుడు డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, జిల్లా సంఘచాలక్. సీఏ దుర్శెట్టి నిరంజనాచారి, నగర కార్యవాహ చామ మహేశ్వర్, కార్యకర్తలు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## రైతులకు మేలైన సాగు పద్ధతులపై అవగాహన

కరీంనగర్ రూరల్, జూన్ 10: దుర్శేడ్ రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ ఆధ్వర్యంలో రైతులకు మేలైన సాగు పద్ధతులపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి, చెట్లని పెంచి పర్యావరణ కాపాడాలని సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఉషారాణి, పంటల సాగులో పాటించాల్సిన ఆరుసూత్రాలను రైతులకు సూచించారు. వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ శాస్త్రవేత్త డాక్టర్ ఏ విజయభాస్కర్, కేవీకే జమ్మికుంట శాస్త్రవేత్త వేణుగోపాల్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఆర్ శ్రీనివాస్ రావు, మండల వ్యవసాయ అధికారి బి. సత్యం వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దుర్శేడ్ సింగిల్ విండో చైర్మన్ తోట తిరుపతి, కరీంనగర్, దుర్శేడ్ సింగిల్ విండో వైస్ చైర్మన్‌లు బీరం ఆంజనేయులు, గోనే నర్సయ్య, మాజీ చైర్మన్ మంద రాజమల్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన



చిన్న ముల్కనూరులో మాట్లాడుతున్న ఎంఈవో

చిగురుమామిడి, జూన్ 10: ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను పంపించాలని చిగురుమామిడి మండల విద్యాధికారి పావని కోరారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని బొమ్మనపల్లి, రేకొండ, ముల్కనూర్ గ్రామాల్లో విద్యావాహిని విద్యా చైతన్య రథం ద్వారా ఎంఈవో, ఉపాధ్యాయులు బడిబాట ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగా భవాని, హేమలత, సురేశ్, బానోతు శారద, శ్రీనివాస్, ఎంఆర్‌సీ పర్యవేక్షకుడు బొడ్డు తిరుపతి, సీఆర్పీలు శ్రీవాణి, బి. ఆంజనేయులు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, విద్యా కమిటీ మాజీ చైర్మన్ బరిగెల సదానందం, గ్రామస్తులు పాల్గొన్నారు.